క్లుప్తంగా

కమిషనర్‌కు సమ్మె నోటీసు



సమ్మె నోటీసు ఇస్తున్న నాయకులు

హిందూపురం టౌన్: హిందూపురం పురపాలక సంఘ పరిధిలోని ఇంజినీరింగ్ విభాగం కార్మికులు నవంబర్ 3 నుంచి చేపట్టనున్న సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మున్సిపల్ కమిషనర్‌కు కార్మిక సంఘం నాయకులు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్ కుమార్, మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు రంజాని, నరేష్, వరదరాజులు, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, మధు, మంజుల పాల్గొన్నారు.

డివిజన్‌స్థాయి పోటీలకు ఎంపిక

హిందూపురం టౌన్: పట్టణంలోని 1వ వార్డు పరిధిలోని కొట్నూరు జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో శనివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్, ఎంపికలను నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని పాఠశాలల నుంచి దాదాపుగా 120 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనగా, ప్రతిభ కనబరిచిన విద్యార్థులను డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వాలీబాల్ అండర్–17 బాలబాలికల విభాగాల్లో సీ.నిశాంత్, డీ. శరత్ బాబు, బీ.బేబీ, బి.మహిత డివిజనల్‌స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం శోభారాణి తెలిపారు.

24న ఎరుకల 'చలో విజయవాడ'



మాట్లాడుతున్న ఎరుకల హక్కుల పరిరక్షణ సమితి నాయకులు

హిందూపురం: నకిలీ ఎరుకుల కుల ధ్రువ పత్రాలు పొంది అన్యకులస్తులు లబ్ధి పొందుతూ అసలైన లబ్ధిదారులకు అన్యాయం చేస్తున్నారు. అలాంటి వారిపై ఉక్కు పాదం మోపేలా చర్యలు చేపట్టాలన్న డిమాండ్‌తో ఈనెల 24న చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎరుకల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కేబీ శంకరయ్య తెలిపారు. హిందూపురం ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ నకిలీ పత్రాలు సృష్టించి విద్య, ఉద్యోగపరంగా తమకు దక్కాల్సిన రిజర్వేషన్ కొల్లగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై రాష్ట్రపతి, జాతీయ ఎస్టీ కమిషన్ ఫిర్యాదు చేసి దశల వారీగా ఉద్యమిస్తామన్నారు.

చైన్ స్నాచింగ్‌కు యత్నం

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లిలో సుబ్బలక్ష్మీ అనే వృద్ధురాలి మెడలో బంగారు చైన్ స్నాచింగ్‌కు గుర్తు తెలియని దుండగుడు యత్నించాడు. ఎస్ఐ రంగడుయాదవ్ వివరాల మేరకు.. కొడిగెనహళ్లిలో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి సుదర్శనశర్మ.. భార్య సుబ్బలక్ష్మీతో కలిసి సొంతిట్లో ఉంటున్నారు. శుక్రవారం ఓ వ్యక్తి ఇంటికొచ్చి కాళ్లు, చేతులకు ఫిజియోథెరఫీ చేస్తానని నమ్మించి వెళ్లాడు. శనివారం కూడా ఇంటికి వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లో ఉన్న సుబ్బలక్ష్మీ మెడలోని బంగారు పూసల దండ, మంగళ సూత్రాన్ని కత్తిరించేందుకు యత్నించాడు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో అక్కడి నుంచి దుండగుడు పరారయ్యాడు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కాలుష్య రహిత జీవనంతో ఆరోగ్యం



ర్యాలీలో పాల్గొన్న జడ్జి శైలజానాథ్, న్యాయవాదులు

హిందూపురం: కాలుష్యం లేకుండా జీవనం సాగించడంతో ఆరోగ్యంగా ఉండవచ్చని జిల్లా అదనపు జడ్జి కంపల్లె శైలజ పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్రా కార్యక్రమంలో భాగంగా శనివారం ర్యాలీ నిర్వహించారు. ఏడీజే కాలుష్యం వల్ల చోటు చేసుకునే దుష్పరిణామాలను వివరించారు. కనీసం వారంలో ఒకరోజు వాహనాలు లేకుండా నడకతో ఇంధనం లేని ప్రయాణం సాగించాలని సిబ్బందికి సూచించారు. జిల్లా అదనపు న్యాయస్థానం పరిపాలనాధికారి సుధాకర్, సీనియర్ సివిల్ జడ్జి కోర్టు సూపరింటెండెంట్ ఉమాదేవి, న్యాయవాదులు రాజశేఖర్, అజయ్, ఆయా న్యాయస్థానాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లోనూ స్వచ్ఛాంధ్ర , స్వర్ణాంధ్ర కార్యక్రమాలను నిర్వహించారు.

ఫ్యాక్టరీ లైసెన్సు పరిశీలన

హిందూపురం: తూమకుంట పారిశ్రామిక వాడలో ఉన్న పైపుల ఫ్యాక్టరీని సీఐ ఆంజినేయులుతో పాటు సిబ్బంది శనివారం తనిఖీ చేశారు. మరో కంపెనీకి సంబంధించి పైపులు తయారు చేస్తున్నారన్న ఫిర్యాదుతో రికార్డులు, లైసెన్స్‌లు, పైపుల అనుమతులు పరిశీలించారు.

అధ్వానంగా ఆర్టీసీ బస్టాండ్లు



దుస్థితిలో సోమందేపల్లి బస్టాండ్



అధ్వానస్థితిలో ఉన్న గోరంట్ల బస్టాండ్

- పట్టించుకొనే వారే కరువు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం

సోమందేపల్లి: లక్షలాది రూపాయలు ఖర్చుచేసి నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్లు అధ్వానంగా మారాయి. భవనాలు శిథిలావస్థకు చేరకున్నాయి. బస్సులు బస్టాండ్‌లోకి రాకపోవడంతో ప్రయాణికులు ఆ బస్టాండ్ల వైపు కూడా వెళ్లడం మానేశారు. పెనుకొండ నియోజకవర్గంలో పెనుకొండ ఆర్టీసీ డిపో ఉన్నప్పటికీ సోమందేపల్లి, పరిగి బస్టాండ్లు మూత పడ్డాయి. కంపచెట్లు పెరిగి యాచకులకు విడిది కేంద్రాలుగా మారాయి. మందుబాబులు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయాయి. గోరంట్లలో పేరుకు మాత్రమే బస్టాండ్ ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా వాటిని వినియోగంలోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.



గోరంట్ల బస్టాండ్‌లో పగిలిన కిటికీలు, పనిచేయని తాగునీటి కుళాయి

పేరుకే బస్టాండ్



మండల కేంద్రమైన సోమందేపల్లి ఆర్టీసీ బస్టాండ్ పేరుకే ఉంది. బస్సులు బస్టాండ్‌కు రావు. ప్రయాణికులకు ఏమాత్రం సౌకర్యాలు లేవు. ప్రైవేట్ వాహనాలు ఆపే పార్కింగ్ స్టాండ్‌గా బస్టాండ్ మారిపోయింది. యాచకులు బస చేసే కేంద్రంగా మార్చుకున్నారు. రాత్రి వేళల్లో తాగుబోతులు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది.

– ఎర్రజోడు రామాంజి, సోమందేపల్లి

బస్టాండ్‌లో సౌకర్యాలు కరువు



పారిశ్రామికంగా కాస్తో కూస్తో మండల పరిసరాలు అభివృద్ధి చెందుతున్నాయి. అయితే ఇక్కడున్న బస్టాండ్ మాత్రం చాలా అధ్వానంగా మారింది. ప్రయాణికులు కూర్చోవడానికి కుర్చీలు లేవు. తాగునీటి సౌకర్యం లేదు. వర్షం వస్తే బస్టాండ్‌కు వచ్చి బస్సులు ఎక్కలేని పరిస్థితి. అధికారులు ప్రయాణికులు కోసం తగిన చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ బాషా, గోరంట్ల

పంటలు కాపాడండయ్యా...



కొండ ప్రాంతంలో గుజరీ వ్యర్థాలు కాల్చిన దృశ్యం

పెనుకొండ రూరల్: తమ పంట పొలాలను కాపాడాలంటూ దుద్దేబండ గ్రామానికి చెందిన రైతులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. రైతులు ప్రదీప్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, పోతన్న, బయన్న మాట్లాడుతూ కొంతకాలంగా కియా, అనుబంధ పరిశ్రమల నుంచి వెలువడుతున్న గుజరీ వ్యర్థాలను గొందిపల్లి కొండ ప్రాంతంలో వేసి నిప్పు పెడుతున్నారన్నారు. దుర్వాసన కారణంగా కాలుష్యంతో సమీపంలోని పంట పొలాలు దెబ్బతింటున్నాయన్నారు. మూగ జీవాలు కూడా మృతి చెందుతున్నట్లు గొర్రెల కాపరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై ఎంపీడీఓ నరేష్ కృష్ణను 'సాక్షి' వివరణ కోరగా ఇప్పటిదాకా తమ దృష్టికి రాలేదన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు చేపడతామన్నారు.

హిందూ ధర్మాన్ని కాపాడాలి



కవాతు చేస్తున్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

పావగడ: జాతీయ స్వయం సేవక్ సంఘ్ నూరు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వందలాది మంది స్వయం సేవకులు పథ సంచలనంను పట్టణంలో శనివారం నిర్వహించారు. పెనుకొండ రోడ్డులోని మారెమ్మ ఆలయం నుంచి పథ సంచలనం ప్రారంభించి వివిధ ప్రాంతాల గుండా ఎస్ఎస్‌కే రంగమందిరం వరకు సాగింది. మధుగిరి జిల్లా సంఘ చాలక్ జయప్రకాశ్ మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాలని పిలుపు నిచ్చారు.

నేడు కోటి సంతకాల సేకరణ

అమరాపురం: మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో ఆదివారం ఉదయం పది గంటలకు కోటి సంతకాల సేకరణ చేపట్టినట్లు మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మడకశిర వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప హాజరవుతారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని కోరారు.

ప్రజలకు చంద్రబాబు చేసింది శూన్యం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, పార్టీ శ్రేణులు

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

గుడిబండ: రాష్ట్ర భవిష్యత్తు, ప్రజల ప్రయోజనాల కోసం ముఖ్యమంత్రిగా చంద్రబాబు చేసింది శూన్యమని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప విమర్శించారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడ్, నాయకులు, కార్యకర్తలతో కలసి వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణలో భాగంగా పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈరలక్కప్ప మాట్లాడుతూ.. మాజీ సీఎం జగన్ పాలనలో 17 వైద్య కళాశాలలను తీసుకువచ్చి పేదలకు వైద్యంతో పాటు విద్యార్థులకు వైద్య విద్యను అందించాలని సంకల్పించారన్నారు. ఇందులో భాగంగానే కొన్నింటిని పూర్తి చేశారన్నారు. అయితే చంద్రబాబు అధికారంలో రావడంతో వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయడానికి పూనుకోవడం దారుణమన్నారు. ఇప్పటికే ప్రజల్లో ప్రభుత్వంపై ఎంతో వ్యతిరేకత ఉందని, రానున్న కాలంలో ప్రజలే కూటమి నాయకులకు బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్ , సర్పంచ్ కరుణాకర్, ఎంపీటీసీలు సభ్యులు పాతలింగప్ప ,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై అక్రమ కేసులు ఎత్తేయాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రమిస్తున్న జర్నలిస్టులు, నాయకులు

లేపాక్షి: సాక్షి పత్రికపై కూటమి ప్రభుత్వం కక్ష కట్టిందని, అందులో భాగంగానే అక్రమంగా సాక్షి కార్యాలయంలో సోదాలు జరిపి ఎడిటర్ ధనుంజయరెడ్డిపై అక్రమ కేసులు పెడుతున్నారని జర్నలిస్టులు, వైఎస్సార్‌సీపీ, వామపక్ష నేతలు, ప్రజా సంఘాల నాయకులు మండిపడ్డారు. శనివారం లేపాక్షిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ నకిలీ మద్యం వ్యవహారం బయట పడినప్పటి నుంచి సాక్షిపత్రిక, ఎడిటర్‌పై కూటమి ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందన్నారు. నిజాలు రాస్తే కేసులు నమోదు చేస్తారా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వెంటనే సాక్షి కార్యాలయంలో సోదాలు ఆపాలని, అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వరకూ బైక్ ర్యాలీ నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో లేపాక్షి మండల జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు గోవర్ధన్‌బాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సయ్యద్ నిస్సార్, వైస్ ఎంపీపీ అంజన్‌రెడ్డి, సీనియర్ నేత బాలాజీ మనోహర్, సీపీఐ మండల కార్యదర్శి గౌతమ్, రైతు సంఘం నాయకుడు గోవిందరెడ్డి, సీనియర్ నాయకులు నారాయణరెడ్డి, మల్లన్న, చలపతి, శ్రీనివాసరెడ్డి, రమేష్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, నరసింహప్ప, రవీందర్‌రెడ్డి, బాలు, మాధవరెడ్డి, శేషాద్రిరెడ్డి, రామాంజి, శివప్ప, శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, చాంద్‌బాషా అన్సర్, తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లిలో ప్రజా సంఘాల ఆందోళన

- అధికారుల నిర్లక్ష్యమే బ్యాంకు ఉద్యోగి మృతికి కారణమని ఆగ్రహం

సోమందేపల్లి: గ్రామ పంచాయతీ అధికారుల నిర్లక్ష్యమే కెనరా బ్యాంకు ఉద్యోగి శివశంకర్ మృతికి కారణమని కుల వివక్ష పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు హనుమయ్య విమర్శించారు. గురువారం రాత్రి వారపు సంతలో పడేసిన కూరగాయలపై నుంచి ద్విచక్ర వాహనం వెళ్లగా జారిపడి తలకు గాయమై బ్యాంకు ఉద్యోగి శివశంకర్ మృతి చెందాడన్ని నిరసిస్తూ శనివారం పంచాయతీ కార్యాలయం వద్ద ప్రజా సంఘాల నాయకులు ధర్నా చేశారు. పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు నిర్లక్ష్యం కారణంగానే గ్రామంలో వివాదాలు జరుగుతున్నాయన్నారు. అక్కడే ఉన్న ఎంపీడీఓ వెంకట లక్ష్మమ్మ స్పందిస్తూ భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరుగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కొద్దిసేపు టీడీపీ నాయకులు ప్రజాసంఘాల నాయకుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. పోలీసులు ఇరువర్గాలకు సర్దిచెప్పి పంపారు. సీపీఎం నాయకులు పెద్దన్న, వెంకటేష్, గోవిందప్ప, కొండా వెంకటేష్, రవి కిష్టప్ప, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

ముగ్గురికి తీవ్ర గాయాలు

అమరాపురం: మండలంలో వేర్వేరుగా రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే గౌడనకుంటకు చెందిన రాఖేష్ తన స్నేహితుడితో పాటు మద్దనకుంట వైపు నుంచి బైక్‌పై స్వగ్రామానికి వస్తున్నాడు. అలాగే కుందురికి చెందిన మంజునాథ కె.శివరంకు వెళ్తున్నాడు. అయితే గుండేగౌడ ఆస్పత్రి వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. మంజునాథ, రాకేష్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని ఆస్పత్రికి తరలించారు.

ట్రాక్టర్ – బైక్ ఢీ ..

మండల పరిధిలోని మద్దనకుంట క్రాస్ వద్ద శనివారం రాత్రి ట్రాక్టర్ – బైక్ ఢీ కొట్టడంతో బైకులో ఉన్న ఉప్పార్లపల్లి శివమ్మ, వినోద్, రంగస్వామిలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరు హేమావతి నుంచి అమరాపురంకు వస్తున్నారు. అమరాపురం నుంచి వస్తున్న ట్రాక్టర్ బైక్‌ను ఢీ కొట్టింది. శివమ్మ తలకు బలమైన గాయాలు కావడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. మిగతా ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి.

దాసప్పపాళ్యంలో తాగునీటికి కటకట

రొళ్ల: మండలంలోని గుడ్డగుర్కి పంచాయతీ పరిధిలోని దాసప్పపాళ్యంలో గత పది రోజులుగా తాగునీరు రావడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు వాటర్ వర్క్స్ బోరుబావులు చెడిపోయినా ఇంత వరకూ ఎవరూ పట్టించుకోలేదన్నారు. విద్యుత్ మోటారు, పైపులతో పాటు కేబుల్ వైర్ తొలగించారన్నారు.వెంటనే నీటి సమస్యను పరిష్కరించాలని లేకపోతే ఎంపీడీఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు.

మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలి

రొళ్ల: మహిళా సంఘాల సభ్యులు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేసి మరింత ఆర్థిక పురోగతి సాధించాలని వెలుగు ఇన్‌చార్జ్ ఏపీ నాగరాజు పేర్కొన్నారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయం ఆవరణలో శ్రీలక్ష్మీనరసింహస్వామి మండల సమైఖ్య 21వ వార్షిక సర్వసభ్య సమావేశం ఘనంగా నిర్వహించారు. అనంతరం నూతన మండల సమైక్య కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా గంగమ్మ, ఉపాధ్యక్షురాలిగా సల్మా, కార్యదర్శిగా పుట్టమ్మ, ఉప కార్యదర్శిగా లక్ష్మీనరసమ్మ, ట్రెజరర్‌గా రోజాను ఎన్నుకున్నారు.

ఆక్రమణల తొలగింపు

పరిగి: మండల కేంద్రం పరిగిలోని సర్వే నంబరు 368–2, 368–4లో ఉన్న ప్రభుత్వ భూమిలో కొందరు పాతిపెట్టిన రాళ్లను అధికారులు శనివారం తొలగించారు. ఫిర్యాదుమేరకు తహసీల్దార్ హసీనాసుల్తానా, ఎస్ఐ రంగడుయాదవ్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని పాతిన రాళ్లను జేసీబీతో తొలగింపజేశారు. తహసీల్దారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 12 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆస్పత్రిని సందర్శించిన కేంద్ర మంత్రి

పావగడ: కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న స్థానిక జపానందస్వామి నిర్వహిస్తున్న స్వామి వివేకానంద సంఘటిత గ్రామీణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన శారదా దేవి కంటి ఆస్పత్రి, పరిశోధన కేంద్రాన్ని చూశారు. మధ్యాహ్న భోజనం సమయంలో మంత్రి సోమన్న రోగులకు ఆహారం వడ్డించారు. ఆస్పత్రి లో ఏర్పాటు చేసిన అన్ని వైద్య చికిత్స విభాగాలను మంత్రి పర్యవేక్షించారు.

ఘనంగా వాల్మీకి జయంతి

రొద్దం: మండల పరిధిలోని తురకలాపట్నం గ్రామంలో వాల్మీకి జయంతి ఘనంగా నిర్వహించారు. శనివారం మహర్షి వాల్మీకి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు జ్యోతులు మోసి మొక్కులు తీర్చుకున్నారు.

చెడుపై మంచి సాధించిన విజయమే దీపావళి





గోరంట్ల: వివిధ వేషధారణలో విద్యార్థులు, గుండుమల పాఠశాలలో హరిత దీపావళి సంబరాలు నిర్వహిస్తున్న దృశ్యం

గోరంట్ల: చెడుపై మంచి సాధించిన విజయాలకు ప్రతీకగా దీపావళి పండుగను జరుపుకుంటున్నామని కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ బట్న కృష్ణారావు అన్నారు. మండల పరిధిలోని పాలసముద్రం సమీపంలోని ఏర్పాటైన కేంద్రీయ విద్యాలయంలో శనివారం దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బట్న కృష్ణారావు దీపావళి విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. తర్వాత విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు అందరినీ ఆకట్టుకున్నాయి.

మడకశిరరూరల్: మండల పరిధిలోని గుండుమల ఉన్నత పాఠశాలలో శనివారం హెచ్ఎం సుకన్య ఆధ్వర్యంలో ఘనంగా దీపాలు వెలిగించి హరిత దీపావళి సంబరాలు జరుపుకున్నారు. పర్యావరణం బాగుంటేనే అందరం బాగుంటామని, హరిత దీపావళికి జైకొడదామని విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు సంబరాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ హరిత దీపావళి అనేది పర్యావరణహిత పద్ధతులలో పండుగను జరుపుకోవడానికి సూచిస్తుందన్నారు. టపాసులు వినియోగాన్ని తగ్గించి దీపాల వాడకాన్ని ప్రోత్సహించాలన్నారు. పర్యావరణాన్ని పెంచుకోవాలని లేకపోతే ప్రకృతి కన్నెర్ర జేస్తే మానవ మనుగడే ప్రశ్నార్థకమని, ప్రకృతికి మేలు చేయకపోయినా కనీసం చేటు చేయకుండా ఉండాలన్నారు.రంగులలో రంగోలిలు వేయడం వంటి పద్ధతులను ప్రజలు అవలంచుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ చంద్రమోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ధన్వంతరి జయంతి



ధన్వంతరి జయంతిలో పాల్గొన్న మంత్రి సవిత

పెనుకొండ: పట్టణంలోని అన్నా క్యాంటీన్ కార్యాలయంలో శనివారం నాయీ బ్రాహ్మణుల ఆరాధ్యదైవమైన ధన్వంతరి జయంతి వేడుకలను నిర్వహించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళీశాఖా మాత్యులు సవిత.. ధన్వంతరి చిత్రపటం వద్ద పూజలు చేశారు. పలువురు నాయీ బ్రాహ్మణులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

టపాసులు అమ్మేందుకు అనుమతి తప్పనిసరి

గుడిబండ: మండలంలో టపాసులు అమ్మడానికి వ్యాపారులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని శనివారం ఎస్ఐ రాజ్‌కుళ్లాయప్ప తెలిపారు. అనుమతలు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయించిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సోలార్ విద్యుత్ వినియోగంపై అవగాహన

మడకశిర: సోలార్ విద్యుత్ వినియోగంపై పట్టణంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ ,విద్యుత్‌శాఖల ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో మున్సిపల్ చైర్మన్ నరసింహరాజు, కమిషనర్ జగన్నాథ్, విద్యుత్ డీఈ రఘు, ఏఈ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

స్కాన్ చేసిన మద్యాన్నే విక్రయించాలి

పెనుకొండ రూరల్: క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేసిన మద్యం బాటిళ్లను మాత్రమే విక్రయించాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య సూచించారు. మండలంలోని పలు మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. సాయి వైన్స్, గుట్టూరులోని ఎస్ఎస్ వైన్స్‌లలో మద్యం బాటిళ్లపై ఉన్న క్యూఆర్ కోడ్‌లను పరిశీలించారు.

పాదయాత్ర విజయవంతం చేయండి

మడకశిర: ముస్లింలకు రాజకీయ రిజర్వేషన్లు సాధించడానికి ముస్లిం ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈనెల 22, 23న రెండు రోజుల పాటు పాదయాత్ర నిర్వహించనున్నట్లు ముస్లిం ఐక్య వేదిక విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు వసీంబేగ్ ఒక ప్రకటనలో తెలిపారు. కడప జిల్లా సింహాంద్రిపురం నుంచి పులివెందుల వరకూ పాదయాత్ర సాగుతుందన్నారు.

విద్యార్థులు ప్రశ్నించడం అలవర్చుకోవాలి



చెకుముకి టాలెంట్ పరీక్ష రాస్తున్న విద్యార్థినులు

హిందూపురం: విద్యార్థులు ప్రశ్నించడాన్ని విద్యార్థి దశలో నేర్చుకుంటూనే ఉత్తమ వ్యక్తులుగా ఎదిగి కొత్త ఆవిష్కరణలకు రుపొందించగలరన్నారని జేవీవీ నాయకుడు గంగిరెడ్డి అన్నారు. మండలంలోని బసవనపల్లి హైస్కూల్‌లో శనివారం చెకుముకి టాలెంట్ పాఠశాల స్థాయి పరీక్షలు నిర్వహించారు. స్కూల్ హెచ్ఎం రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయులు అశోక్, గురుమూర్తి, రఘు, వినుత, విజయ, కల్పన, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ పర్యటన

సోమందేపల్లి: మండలంలోని పందిపర్తిలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ఆదివారం పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గజేంద్ర తెలిపారు. రచ్చబండ కార్యక్రమంలో పాల్గొంటారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
హిందూపురం డివిజన్
9912220723, 9494767933, 9912220726